

టీవాలా కథ

ముళ్ళపూడి వెంకటరమణ

'ఒకూళ్ళో రోటీవాలా, బేటీవాలా అని ఇద్దరు శత్రువు లుండేవారు. ఇద్దరూ ఎప్పుడూ అడ్డమైన వాటికీ పోటీపడే వారు. ఎదురున్న పదవి గొప్పదా కాదా అన్న ప్రశ్నకాదు. అది ఎదరవాడిక్కా-వాలా వద్దా అనే. వాడిక్కా-వాలంటే వీడికీ అదే కావాలి. ఈ వరుసనుండేది. ఓసారి మునిసిప లెలక్షనుకి పోటీపడ్డా రిద్దరూ, ఇలాటలాటి పోటీగాదు. వచ్చేది పదిరూపాయలైనా, నూరూపాయలు తగలేసేటంతగా సాగింది ప్రచారం. పెద్దెలక్షన్‌లకి జేసినంత హ డా వు డి జేశారు. రోటీవాలా కిటికీలంత పోస్టర్లే యిస్తున్నాడని తెలిసి, బేటీవాలా దోర బంధాలంత యేయించాడు. ఆపై యిత గాడు గోడలంత రాయించాడు. దరిమి లాను సైజులు చాలక, రోటీవాలా పోస్టర్లో మొదటక్షరంమీద 'బే' అన్న దంటించి అన్నీసొంతం జేయించాడు బేటీ వాలా. రాత్రికి రాత్రి రోటీవాలా బయల్దేరి, మళ్ళీ అన్నిటి మీదా 'రో' అన్న అక్షరం అంటించాడు. తెల్లారేసరికి ఇద్దరికిద్దరూ ఒక ర్నొకరు జూసి నవ్వుకోబోయి కెవ్వుమన్నారు. పోస్టర్లమీద 'రో' లేదు, 'బే' లేదు. తెల్లకాగితాలంటించున్నాయి. 'టీవాలా' గోదాలో కొచ్చాడంటే వొచ్చా డన్నారు.

నామీది ఓడితే నువ్వోడాలిదప్ప,

ఆడోడితే నాకేం గొప్ప అంటూ ఇద్దరి కిద్దరూ టీవాలా మీదకి దండెత్తి పాట పాడారు. చివరికి టీవాలా గోదాలోంచి తప్పుకొని బేటీవాలాతో కలిశాడు.

పోటీవాలా లిద్దరూ మళ్ళీ పుంజుకున్నారు. ఎలక్షను చాలాచోట్ల లాగే పార్సు పద్ధతి కొచ్చింది. కాని ఆవేశాలు పెరిగాయి.

బేటీవాలా, చివర్రోజున పెద్ద మొత్తం అప్పుతెచ్చి నోట్లుజల్లి ఓట్లు పండించబోయాడు. ఆ జోరుముందు రోటీవాలా ఆగలేక మాటాడ కూరుకున్నాడు. సాయంత్రం పొద్దుగుంకే వేళకి, ఇహ రోటీవాలా ఓడినట్టే పోలింగనవసరమన్నారు, జనం.

అవుననవసరవేఁ, నేన్నెగ్గడంఖాయం అన్నాడు రోటీవాలా. ఆ మొండిధైర్యం జూచి అతని మనుషులుగూడా నివ్వెరబోయారు.

"చెప్పుచూదాం సుబ్బరాజూ. ఆ పోటీలో నెగ్గి బాగుపడ్డ దెవరు?" అన్నారు రెడ్డిగారు.

"చెప్పడానికి సిగ్గేస్తదిగాని, తప్పదుగాబట్టి చెబతన్నాను. నెగ్గినోడు వేరు; బాగుపడ్డవాడు వేరూనూ. రోటీవాలా నెగ్గాడు బేటీవాలా ఓడగా టీవాలా బాగుపడ్డాడు" అన్నాడు సుబ్బరాజు.

"అదెలాగ?" అన్నారు రెడ్డిగారు ఆశ్చర్యం అభినయించి.

"ఇప్పుడీ బేటీవాలా అనేవాడు ఓట్ల కోసం నోట్లు జల్లేస్తుంటే, రోటీవాలా కానీ విదపకుండా, కాలు కదపకుండా కూర్చున్నాడంటే ఏదో గడుసు యెత్తు వేసుండాలి గదా? అడి నోట్ల పంపకం కానిచ్చి, బాగా పొద్దుబోయాక, ఈడు పెద్ద పుకారేసుంటాడు. బేటీవాలా పంచినవన్ని దొంగ నోట్లని."

రామిరెడ్డిగారు ఉలిక్కిపడి తలెత్తి జూశారు సుబ్బరాజు కేసి. హఠాత్తుగా అతనిమీద గౌరవం పెరిగింది. భుజం తట్టారు. "మరి టీవాలా బాగుపడ్డాడన్నావదెలా?" అన్నారు ఆప్యాయంగా.

"అడికి పుకారు సంగద్దెలీగానే, రాత్రికి రాత్రి సైకిలేసుకుని, ఇంటింటికీ వెళ్ళి బేటీవాలా పంచినయి దొంగనోట్లని పుకారొచ్చిందని, ఒకేళ పొరబాట్నాది నిజమైతే మంచియి ఫిరాయింపిస్తాడనీ జెప్పి, పోలీసు లొస్తారనీ కంగారుబెట్టి, ఆ పగలు పంచినయన్నీ వసూలుజేసుకొని, నూటి కే పదిరూపాయలో నిజాయితీకోసం బేటీవాలాకిచ్చి కడంవి జాగ్రత్త బెట్టాడు" అన్నాడు సుబ్బరాజు.

జవాబు చెప్పాడేగాని అతనికెందుకో సిగ్గేసింది. తలొంచేసుకున్నాడు. కడుపులో ఇలాటి ఊహ లున్నట్లు అతని కెన్నడూ తెలీదు. రెడ్డిగారి మీదకూడా కోపం వచ్చింది

మర్యాదస్థుడి కథ

"సిగ్గెందుకు? మరేం పరవాలేదులే. కథకోసం జెప్పావు. నివ్వలా టోడివని అనుకోన్లే. ఇది జరిగినా మానినా, ఎదటోడి యెత్తులు ఊహ జేసి జాగర్త పడాలి గదా? నేనో చిన్న కథ జెబుతా. అందులో బ్యామ్మలాయన మనసు కనిబెట్టు చూదాం. ఆయన పెద్ద ఖామందు. ఏదో శాస్త్రిగారు (అంటూ కథ ఆరంభించారు రెడ్డిగారు). ఇంటికేవే శెవరొచ్చినా భోజనం పెట్టి, రాత్రివేళయితే పడుకుందుకు వంచ జూపి మర్యాజ్జేసేవాడు. ఇలా గుండగా ఒకనాడురాత్రి భోజనం వేళకి ఇద్దరు పెద్దమనుష లొచ్చారు. ఒకాయన మంత్రిగారు. మరొకాయన అపోజిషనులీడరు. ఇద్దరూ గొప్పవాళ్ళే.

ఆ ప్రాంతంలో కరువొచ్చి జనం కటకటలాడుతున్నారని దెలిసి చూడడానికి బయల్దేరారు. మరి బలగం లేదా అనేవు. అంతకుముందెన్ని అర్జీలొచ్చినా మంత్రిగారు నమ్మలేదు. అంటే వెళ్ళలేదు. ఓచోట సన్మానాని కనివెళ్ళేసరికి అక్కడ సభలో ఈ అపోజిషను నాయకుడు తటస్థపడి సభలో చెరిగేశాడు. ఓ కవరు దీసిచూపించి, కరువు ప్రాంతం నుంచి తనకి అందిన అర్జీ అనీ, దాని మీద తపాలాబిళ్ళ అంటించడానికి కూడా నాలికలు తడారిపోయినందు వల్లా, నీటిచుక్క పుట్టనందువల్లా స్టాంపుని గుండుసూదికేసి గుచ్చి పోస్టులో వేశారనీ అన్నాడు.

దాంతో గోలయింది. మినీష్టరుగా రేంజేస్తున్నాడని పేపర్లు రాశాయి. రాజధానిలో ప్రభుత్వానికి ఎసరు మరుగుతోందని తెలిసి మంత్రిగారు నిలుచున్న పళంగా కారుజేసుకొని కరువు ప్రాంతానికి బయల్దేరాడు. ప్రతిపక్ష నాయకుడు గూడా ఆయనవెంట కదిలాడు. దారిలో కారు చెడిందిట. డ్రైవరును అక్కడొదిలేసి ఇద్దరూ నడక సాగించి శాస్త్రిగారి భవంతి చేరారు అసురుసురంటూ. ఆయన నిర్ఘాంతపోయి అహో ఇంతవారెంత ఘనంగా రావాలీ, డీలా అయిపోయొచ్చారూ అని పని విని మర్యాద జ్జేశాడు.

ఇది ప్రజాస్వామ్యవూ, మంది రామరాజ్యవూ అంచేతకుల భేదాలను పబ్లికున చూపించరాదని ఆయనకి తెలిసినా, ఆయనదారి ఆయనదే. దేనికీ జంకే రకం కాదు. మంత్రిగారికి తన బంతిన పీట వేయించి భోజనంపెట్టాడు. ప్రతిపక్ష నాయకుడినిమాత్రం గదిలోకే పంపాడు. ఆయనా ఈయనా కూడా నవ్వుకున్నారు, ఈ ఛాందసుడి అమాయకత్వానికి. సరే, ఓ రాత్రివేళ కారు బాగుపడొచ్చింది. ఇద్దరూ లేచి సెలవు దీసుకొని బయల్దేరి వెళ్ళిపోయారు.

వెళ్ళినచోట ఈపాటిగూడా తిండీ, దాహం దొరకలేదనుకో. అక్కడ జనం



పువ్వులు లేక కాయితపుపువ్వుల దండలూ, ఖద్దరుమాలలూ వేశారు. మంత్రిగారి గుండె గుభేలుమంది— కరువున్జూసిగాదు, దీనివల్ల ముందు రాబోయే ఉత్పాతాన్ని తలుచుకొని. ప్రతిపక్ష నాయకుడు చిరునవ్వు నవ్వాడు - నే చెబితే విన్నారా అని. శాస్త్రిలుగారుకూడా అడేపొచ్చి వీళ్ళిద్దరినీ చూసి, మంచినీళ్ళు సప్లయిచేసి వెళ్ళాడు.

అక్కడ అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అంతా సిద్ధమవుతున్నారనీ, ప్రభుత్వ పక్షంలో దాంకున్న ప్రతిపక్ష గ్రూపులు బయటి కొస్తున్నాయనీ తెలిసి, మంత్రిగారూ, ప్రతిపక్ష నాయకుడూ రాజధానికి అర్జెంటుగా బయల్దేరారు. ఎమర్జెన్సీ పరిస్థితి గదా? అదేం చిత్రమో తిరుగుదారిలో కూడా కారు చెడింది క్రిందటిసారిలాగే. ఈసారి రాత్రి పది గంటలవేళ పెద్దలిద్దరూ శాస్త్రిగారి భవంతి చేరారు. భోజనానికి కూర్చోబోతున్న శాస్త్రిలుగారు లేచివచ్చి ఇద్దరికీ మర్యాదల్జేశాడు. రాజధాని భోగట్టా తనకు తెలిసింది చెప్పి వారికి తెలిసింది విన్నాడు. స్నానాలు కాగానే భోజనానికి లెమ్మన్నాడు. ఈమాటు ప్రతిపక్ష నాయకుణ్ణి లోపలికి దీసుకెళ్ళి తన చెంతన కూర్చోబెట్టి భోజనం పెట్టాడు. మంత్రిగారికి మాత్రం గదిలోకి పంపాడు భోజనం.

మంత్రిగారు ఈ మాటు నవ్వుకోలేదు, తను బ్రాహ్మడేగాని, తనతో వచ్చినాయిన నాయుడు మరి. శాస్త్రిల్లుగారు పొరబడడానికి ఆస్కారంలేదు.

చిన్నబుచ్చుకొని ఆకలివల్ల మారు మాటాడక భోజనం అరగింపు కానిచ్చాడు. కార్రాగానే ఇద్దరూ వెళ్ళిపోయారు.

"సుబ్బరాజూ, శాస్త్రిలుగారు ఇలా విపరీతంగా మర్యాదలు చేయటానికి అర్థవేవిటి? బ్యామ్మలాయనకి బయట భోజనం పెట్టి నాయుడిని తన బంతినెందు కూర్చోబెట్టాడు? అది మొదటిసారెందుకు చెయ్యలేదు?" అన్నాడు రెడ్డిగారు కథ ఆపి.

సుబ్బరాజు వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. ఒక నిమిషంసేపు ఆలోచించాడు. చివరకో తీర్మానానికొచ్చాడు.

"శాస్త్రిర్లుగారు ఆళ్ళ కులాల్ని బట్టి మర్యాదచెయ్యలేదు. బుద్ధుల్ని బట్టీ, ఉద్దేశాల్ని బట్టీని. కరువు ప్రాంతం చూడబోయేటపుడు మంత్రిగారు కరువు అనుకున్నంత దారుణంగా ఉండకూడదనీ ప్రజలు కులాసాగాఉండి తనమాట దక్కాలనీ వర్షాలు కురవాలనీ దేవునికి మొక్కుకుంటూ ఉంటాడు గదా? అందుకాయనకి మర్యాదచేశాడు. ఇహ ప్రతిపక్షపాయన కరువు జోరుగా ఉండాలనీ ఈ దెబ్బదెబ్బ గవర్నమెంటు దెబ్బతిని తాము పవరులో కెక్కాలనీ కోరుతాడనీ ఊహజేసి ఆయనకి బయట కూడుబెట్టించాడు. తిరిగొచ్చేటప్పుడు కథ అడ్డం తిరిగింది. మంత్రిగారు పదవి దిగడం ప్రతిపక్షపాయన పవరు కెక్కడం ఖాయం అని తేలిపోయింది. ఆ టయిములో ప్రతిపక్షపాయన తను పదవికిరాగానే వర్షాలు కురవాలనీ, పంటలు పండాలనీ కోరుతాడు. మంత్రిగారు యీ పరిస్థితి ఇలాగే సాగి ఈఖ్యా ఇరుకున పడాలని కోరుతాడు. శాస్త్రిర్లుగారు ఇలా ఊహచేసి బ్యామ్మలాయనకి బైటా, నాయుడుగారికి లోనా భోజనంబెట్టి మర్యాజ్జేశాడు" అన్నాడు.

రామిరెడ్డిగారు జాలిగా నవ్వి సుబ్బరాజు వీపు తట్టాడు. "సుబ్బరాజూ, నివ్వు నా కతలు విని చెడ్డావు. అన్నిటికీ అతి తెలివి జవాబులు ఆలోచిస్తున్నావు. గాని అందులో రహస్యం ఒకటే. శాస్త్రిలుగారు అన్ని అర్థాలూ, తాత్పర్యాలూ చూడలేదు. వెళ్ళేటపుడు మంత్రిగారు పవరులో వున్నాడు. తిరిగి వెళ్ళేటపుడు ప్రతిపక్షపాయన పవరులోకి రాబోతున్నాడు. అంతే. పదవినిబట్టి ఆయన మర్యాజ్జేశాడు. ఆయనేటి, ఎక్కడేనా ఈ నాడంతే" అన్నాడు.